క్లుప్తంగా

రైతుల డిమాండ్లు నెరవేర్చాలి



సంఘీభావ ర్యాలీలో జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు

హుస్నాబాద్: రైతుల న్యాయపరమైన కోరికలను నెరవేర్చని మోదీని గద్దె దించాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరుగుతున్న రైతుల దీక్షకు మద్దతుగా హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దేశానికి అన్నం పెట్టి రైతులను ఇబ్బందుకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్న, మిత్ర పక్షాల, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించాలి



మంత్రి పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న బీసీ సంఘ నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో బీసీ భవన్, బీసీ ఫంక్షన్ హాల్, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఏర్పాటు కోసం రెండు ఎకరాల భూమి, రూ.5 కోట్లు నిధులు కేటాయించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం బీసీ సంఘాల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. పట్టణంలో కల్లు గీత కార్మిక సంఘం భవన నిర్మాణ కోసం 5 కుంటల స్థలంతో పాటు రూ.20లక్షలు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

దుబ్బాక: మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 13 మంది కరాటేలో సత్తా చాటారని కరాటే మాస్టర్ శ్రీకాంత్ తెలిపారు. రుద్రమదేవి షోటాకాన్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్.. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో 2 వేల మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలో 13 మందిలో 3 గోల్డ్ , 4 సిల్వర్ , 6 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. దుబ్బాక ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన శ్రీజ, చెల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రణవి, రమ్యశ్రీ గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. పలువురు వీరిని అభినందించారు.

అలయన్స్ క్లబ్‌కు మూడు అవార్డులు



ఆత్మారాములును సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్ క్లబ్ దక్షిణ భారతదేశ కన్వెన్షన్‌లో భాగంగా ఉత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను సిద్దిపేట అలయన్స్ క్లబ్‌కు మూడు అవార్డులు వచ్చాయని క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ సోమవారం తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో హైదరాబాద్‌లో అలయన్స్ దక్షిణ భారతదేశ కన్వెన్షన్ నిర్వహించారన్నారు. 2022-23కుగాను ఉత్తమ జిల్లా వైస్ గవర్నర్‌గా సోమ వనజ, ఉత్తమ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్‌గా ఆత్మారాములు, సౌత్ మల్టిపుల్ అదనపు పీఆర్ఓగా అంజయ్యలు అవార్డులు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఐదు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

చెరువులోకి గోదావరి జలాలు

గజ్వేల్: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో గోదావరి కాలువ నుంచి చెరువులోకి నీటిని పంపింగ్ చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలువలో 10 హెచ్‌పీ బోరు మోటారును ఏర్పాటు చేసి చెరువును నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఐదు రోజులుగా సేవలు బంద్

- తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టని బాలరాజు
- రిజిస్ట్రేషన్లు ఇతరత్రా పనుల కోసం వచ్చి వెనుదిరుగుతున్న ప్రజలు



ఖాళీగా దర్శనమిస్తున్న తహసీల్దార్ కుర్చీ

కొండపాక(గజ్వేల్): తహసీల్దార్ బాధ్యతలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రెవెన్యూ శాఖలో బదిలీలను చేపట్టింది. ఇక్కడి తహసీల్దార్ శ్రీనివాస్ గత గురువారం గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయానికి, అక్కడ ఎమ్మార్వో బాలరాజును కొండపాకకు బదిలీ చేసింది. అదేరోజున శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. కానీ బలరాజు మాత్రం కొండపాక తహసీల్దార్‌గా సోమవారం వరకు కూడా బాధ్యతలు చేపట్టలేదు. నాలుగైదు రోజులుగా ఈ కార్యాలయంలో రెవెన్యూ పరమైన సేవలు నిలిపోయాయి. ప్రతీ రోజు భూముల రిజిస్ట్రేషన్ల కోసం మీ సేవాలో స్లాట్ బుక్ చేసుకున్న వారితో పాటు రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చి సాయంత్రం వరకు వేచి చూసి తహసీల్దార్ లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ విషయమై .. 'సాక్షి' రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శిస్తే భూముల రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఇతరేత్ర పనుల కోసం వచ్చి కార్యాలయం ఎదుట సాయంత్రం 4 గంటల వరకు వేచి ఉండటం కనిపించింది. ఇప్పటికి రెండు మార్లు భూమి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చి నిరాశతో వెళ్లిపోతున్నామని ప్రజలు పేర్కొన్నారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టే వరకు రెవెన్యూ సేవలు ఆగకుండా ఉండేందుకు ఇతర సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు.

పల్లెప్రగతి వనంలో గుడిసెలు

నర్సయపల్లి వాసుల నిరసన
ఇవే మా భూములేనంటున్న దళితులు



పల్లె ప్రకృతి వనంలో దళితులు ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

మద్దూరు(హుస్నాబాద్): పల్లెప్రగతి వనంలో మండలంలోని నర్సయపల్లి గ్రామానికి చెందిన సుమారు 35 దళిత కుటుంబాలు సోమవారం గుడిసెలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ నివాస స్థలాలను పల్లె ప్రకృతి వనం కోసం ఇస్తే, దానికి ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం కేటాయిస్తామని అప్పటి నాయకులు, అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఏళ్లు గడుస్తున్నాయి కానీ ఇప్పటి వరకు ఎలాంటి స్థలం చూపలేదన్నారు. దీంతో తమ భూముల్లో గుడిసెలు వేసుకున్నామన్నారు. ఇవి తమ తండ్రులు, తాతలకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఈ భూమిని ఇచ్చారన్నారు. గతంలో పల్లె ప్రకృతి వనం గోడలు కూల్చి వేసిన వారిపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసులు నమోదు చేశారని అన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తానన్నారు.

అనాథలకు ఎస్‌ఎంఆర్ చేయూత



చిన్నారులకు నగదు అందజేస్తున్న నీలం మధు

గజ్వేల్‌రూరల్: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు కాంగ్రెస్ నాయకులు 'ఎస్‌ఎంఆర్' యువసేన నిర్వాహకుడు నీలం మధు అండగా నిలిచారు. మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన వీఆర్ఏ భాస్కర్ అతడి భార్య కవితలు అనారోగ్యంతో మృతి చెందగా వారి ఆరేళ్లలోపు ముగ్గురు పిల్లలు కావ్య, శ్రీవాణి, కుమార్ అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఎస్‌ఎంఆర్ యువసేన ద్వారా రూ. 2 లక్షలను అందజేశారు. ఒక్కొక్కరి పేరున రూ. 50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, మరో రూ. 50 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, మున్ముందు వారి చదువుకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అయితే గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో కొల్గూరు మాజీ సర్పంచ్ మల్లం రాజు, ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి, తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ గుండపల్లి శ్రీను, కోకన్వీనర్ జగన్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు, ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి



సిద్దిపేటజోన్: పట్టణంలో బైక్ ర్యాలీ

సిద్దిపేటజోన్/దుబ్బాక/బెజ్జంకి(సిద్దిపేట)/గజ్వేల్ రూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/ జగదేవ్‌పూర్ (గజ్వేల్)/ కొండపాక(గజ్వేల్)/హుస్నాబాద్/ మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట(దుబ్బాక): నేటి యువత శివాజీ అడుగు జాడల్లో నడువాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఛత్రపతి శివాజీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాల వద్ద ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల వారు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలుచోట్ల ఆయన నూతన విగ్రహాలను ఆవిష్కరించారు.

- రాబోయే శతాబ్దం అంతా హిందూ శతాబ్దమేనని సామాజిక సమరసత ప్రముఖ్ అప్పాల ప్రసాద్ జీ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ముందుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.



దుబ్బాక: విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



తొగుట(దుబ్బాక):కాన్గల్‌లో శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సభ్యులు



నంగునూరులో.. పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు



జగదేవ్‌పూర్: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లో ఛత్రపతి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న నేతలు



మిరుదొడ్డి(దుబ్బాక): ఆరెపల్లిలో జయంతి వేడుకల్లో సభ్యులు

గౌరవెల్లిలో నీళ్లు కనిపించడం లేదా?

హనుమకొండ జిల్లా జెడ్పీ చైర్మన్ సుధీర్‌బాబు



ప్రాజెక్టును చూస్తున్న సుధీర్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): కళ్లు ఉండి చూడలేని గుడ్డి వారా? గౌరవెల్లి ప్రాజెక్టులో దాదాపు టీఎంసీ వరకు నీళ్లు నిండి గోదావరి జలాలతో కళకళలాడుతోందని హనుమకొండ జిల్లా జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తి కాలేదంటున్న కాంగ్రెసోళ్లు కట్టపైకెక్కి చూడాలని హితవుపలికారు. ఈ ప్రాంత మెట్ట రైతులకు సాగు నీరు ఇచ్చేందుకు ప్రాజెక్టును ప్రారంభానికి సిద్ధం చేస్తే కుట్రపూరితంగా ఎన్జీటీలో కేసులు వేశారన్నారు. మంత్రి పొన్నంకు చిత్తశుద్ధి ఉంటే త్వరగా ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుడాటిపల్లి ఎంపీటీసీ సభ్యులు బైరి రవీందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కాసర్ల అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహానికి భూమి పూజ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలకేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలో 14వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం ఈ నెల 21న నిర్వహిస్తామని ఏపీఓ ఎర్రోల్ల కిషన్ తెలిపారు. 2022-23 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ నిర్వహిస్తారన్నారు. ఉదయం పది గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

వేధింపులకు గురిచేస్తే ఊరుకోం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పాపన్నపేట(మెదక్): అధికారులను వేధింపులకు గురిచేస్తే వారిని ఊరుకోమని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హెచ్చరించారు. సోమవారం ఎంపీపీ చందన అధ్యక్షతన నిర్వహించిన పాపన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పొడిచన్‌పల్లి ప్రత్యేక అధికారి వెంకట రమణమ్మ మాట్లాడుతూ.. గ్రామంలో కొంత మంది నాయకులు తనకు ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో రాజకీయాలు పక్కన బెట్టాలని అన్నారు. రాజకీయ కక్షలతో అధికారులను బెదిరిస్తే చర్యలు ఉంటాయన్నారు. గ్రామాభివృద్ధికి అధికారులు, నాయకులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని కోరారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్ బాబు ఉన్నారు.

చనిపోయిన వ్యక్తికి పింఛన్?

- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పోస్టు
- దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు



చనిపోయిన వారికి పింఛన్ అంటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పోస్టు

గజ్వేల్‌రూరల్: చనిపోయిన వ్యక్తిపై పింఛన్ తీసుకుంటున్నారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ఈ ఘటన మండల పరిధిలోని దాచారం గ్రామంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. దాచారం గ్రామానికి చెందిన వృద్ధురాలు గుండ లక్ష్మి డిసెంబర్ 27, 2021లో మృతి చెందింది. ఆమెకు కొడుకులు చక్రపాణి, నారాయణ, శ్రీను ఉన్నారు. అయితే గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ సహకారంతో చక్రపాణి తన తల్లి మృతిచెందినా 16 నెలలుగా పింఛన్ తీసుకుంటున్నాడని సోషల్ మీడియాలో ఓ వ్యక్తి చేసిన పోస్టు పెట్టాడు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శితో పాటు చక్రపాణిపై చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నాడు. ఇదే విషయమై సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణను సంప్రదించగా వివరణ ఇచ్చారు.గుండ నారాయణ కొడుకు మురళి ఇటీవల తన ఇంటికి నల్లా కనెక్షన్ కావాలని కోరినట్లు అన్నపూర్ణ చెప్పారు. అయితే చక్రపాణి, నారాయణలకు ఆ ఇంటి స్థలానికి సంబంధించి తగాదాలున్నాయని, కోర్టులో కేసు ఉన్న ఇంటికి నల్లా కనెక్షన్ ఎలా ఇస్తారని చక్రపాణి ప్రశ్నించడంతో కనెక్షన్ ఇవ్వడం కుదరదని మురళికి చెప్పినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి మురళి తనపై కక్ష పెంచుకుని లేనిపోనివి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం మొదలు పెట్టాడని ఆమె చెప్పారు. లక్ష్మి చనిపోయిన కొద్ది రోజులకే పింఛన్ నిలిచిపోయిందని, మురళి కావాలనే సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాడని తెలిపారు. మురళిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కాగా, ఇదే విషయమై ఎంపీఓ దయాకర్‌ను సంప్రదించగా... చనిపోయిన వ్యక్తికి పింఛన్ అందిస్తున్నారంటూ వస్తున్న పుకార్లలో వాస్తవం లేదని, గ్రామస్తులు ఎవరికైనా అనుమానం ఉంటే ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ మినీబ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మినీ బ్యాంక్ సేవాలను వినియోగించుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ మల్లేశం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ బ్యాంక్ పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా హైరిక్స్ ఇన్‌చార్జి శంకర్, జోగు నాగరాజు, కుమార్, భాను, శ్యామల, మినీ బ్యాంక్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

◆ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

బెజ్జంకి(సిద్దిపేట): పాపన్నపల్లెలోని హనుమాన్ దేవాలయంలో ధ్వజ స్తంభ, నవగ్రహ ప్రతిష్ఠా వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో విగ్రహాలను ఊరేగించి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 5వ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని డీసీసీ జనగామ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 5వ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్‌తో పాటు ఆయన తండ్రి మాజీ మల్లన్న ఆలయ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, సోదరుడు ఆడెపు మహేష్, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగుల వెంకటేశం, మరి కొంత మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ రక్తదానం చేసిన కానిస్టేబుల్

సిద్దిపేటకమాన్: ఒక కానిస్టేబుల్ రక్తదానం చేశాడు. పట్టణానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు అత్యవసరంగా రక్తం కావాలనే విషయాన్ని ఎస్‌బీ కానిస్టేబుల్ వేణు తెలుసుకున్నాడు. వెంటనే స్పందించి ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు. ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.

◆ తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్ ఖాన్



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్ ఖాన్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆస్థానంలో విధులు నిర్వహించిన జోగినిపల్లి రాజేశ్వర్‌రావు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో విధులు నిర్వహించిన సమీర్ ఖాన్ ఇక్కడికి వచ్చారు.

◆ వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న అజ్మతుల్లా హుసేనిని సిద్దిపేట కాంగ్రెస్ నేతలు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలీమొద్దీన్ ఉన్నారు.

◆ సమ్మక్క సారలమ్మకు పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మేడారం సమ్మక్క సారలమ్మను కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవార్లకు బంగారం (బెల్లం) సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా మంతూరి లక్ష్మి (మల్లుపల్లి) నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షురాలు మొగిళి సునీతారావు, ముద్దం లక్ష్మిలు సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంతూరి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరుస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షురాలిగా నియమించిన నేతలకు, దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేష్, ఉపాధ్యక్షుడు హర్షద్, మండల మహిళా ఉపాధ్యక్షురాలు రాధ, కో ఆర్డినేటర్ సుమలత, యూత్ ప్రెసిడెంట్ జహంగీర్, సెక్రటరీ మహేష్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆధార్ సెంటర్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని మునిగడపలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే సెంటర్ నిర్వాహకులు చార్జీలు వసూలు చేయాలన్నారు. ఎక్కువ మొత్తంలో చార్జీలు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు కిషన్, బాలయ్య, బాలకిషన్, ఐలయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

◆ గౌరారం ఎస్సైగా శివకుమార్



వర్గల్(గజ్వేల్): గౌరారం ఎస్సైగా జే శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన .. సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణతోపాటు సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

సిద్దిపేటఅర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న బూరుగుపల్లి శివారు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు మెరూన్ కలర్ బ్లూ చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. చేయిపై ఇంగ్లిష్‌లో జోగా అని పచ్చబొట్టు ఉందని ఎస్ఐ తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే 87126-67321 నంబర్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని మైసంపల్లి గ్రామంలో పది లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో కోహెడ మండలంలోని పలు గ్రామాలకు కోటీ రూపాయల నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారి భోంగేశ్వర్, మాజీ సర్పంచ్ సుధాకర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దూలం శ్రీనివాస్ పాల్గొన్నారు.